క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో సాయి ఆరాధన



సాయిబాబా చిత్ర పటం వద్ద ప్రార్థన చేస్తున్న సాయి భక్తులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్యసాయి బాబా ఆరాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో వేదం, భజన, బియ్యంతో లక్షార్చన, మహా మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. ఓల్డ్‌బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. అభాగ్యులకు ఆహారం ప్యాకెట్లు, 500 మజ్జిగ బాటిళ్లను పంపిణీ చేశారు. సాయి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా సింధియా శుభప్రద



డాక్టర్ సింధియా శుభప్రదకు ఆర్డర్ కాపీ ఇస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సింధియా శుభప్రద నియమితులయ్యారు. కళాశాలలోని ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెకు గురువారం వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఇస్తూ ఉత్తర్వులు అందజేశారు.

విశ్రాంత హెచ్‌ఎంకు సన్మానం



మియ్యాను సన్మానిస్తున్న అతిథులు, కళాకారులు

కర్నూలు కల్చరల్: విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, గజల్ గాయకుడు, టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యాను ఘనంగా సన్మానించారు. గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మియ్యాను కళాక్షేత్రం సభ్యులు, కళాకారులు సన్మానించి ఉపాధ్యాయునిగా, కళాకారునిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రతిభా విద్యా సంస్థల అధినేత అరుణాచలం రెడ్డి, కళాక్షేత్రం సభ్యులు ఇనాయతుల్లా, ఈశ్వరయ్య, సంగా ఆంజనేయులు, క్రిష్టఫర్, రాజారత్నం, యాగంటీశ్వరప్ప, బాలవెంకటేశ్వర్లు, పాండు రంగయ్య, రాముడు, రమణ, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సాధు శ్రీనివాసరెడ్డి

కర్నూలు సిటీ: నగరంలోని కేవీఆర్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో గురువారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ స్కూల్ కరస్పాండెంట్ సాధు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రాథమిక స్థాయి నుంచి, హైస్కూల్ వరకు ప్రతి తరగతిలో ప్రస్తుతం చదువుతున్న తరగతి పూర్తి చేసుకున్న వారందరికీ కోర్సు పూర్తయినట్లు పట్టాలను అందించామన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు 33 మంది ప్రథమ శ్రేణిలో, ఇద్దరు ద్వితీయ స్థానం, మరో ఇద్దరు విద్యార్థులు తృతీయ స్థానంలో ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ దినోత్సవంలో జెడ్పీ చైర్మన్



పీఆర్ దినోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొన్నారు. చైర్మన్‌తో పాటు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్, కర్నూలు, గూడూరు, జూపాడుబంగ్లా, డోన్ జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, పోచా జగదీశ్వరరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే పీఆర్‌అండ్‌ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజను జెడ్పీ చైర్మన్ మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉగ్రవాదంపై ఆగ్రహం



సుందరయ్య సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



ఆర్‌యూలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై జిల్లాలో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. మృతులకు నివాళులర్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం సీపీఎం ఆధ్వర్యంలో నగరంలోని సుందరయ్య జంక్షన్‌లో కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో మరణించిన యాత్రికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ..కశ్మీర్‌లో ఉగ్రదాడికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. నెల రోజుల ముందే ఉగ్రదాడిని ఇంటలిజెన్స్ హెచ్చరించినా ఎన్‌డీఏ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దాడి జరిగిన తరువాత హిందూ ముస్లింల మధ్య గొడవపెట్టి త్వరలో జరిగే బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల్లో లాభం పొందేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చూస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్ల నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ చేయకపోవడాన్ని అలుసుగా తీసుకున్న ఉగ్రవాదులు దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి రాజకీయాలు వదిలి దేశ రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నా ప్రజలంతా అండగా నిలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో శాంతి ర్యాలీ

కర్నూలు కల్చరల్: ప్రపంచ శాంతి వర్ధిల్లాలి.. ఉగ్రవాదం నశించాలనే నినాదంతో ఆర్‌యూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గురువారం ఆర్‌యూ వద్ద విద్యార్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాజు, సాగర్, అమర్, కృపాకర్, గణేష్, రతీష్, రాజేంద్ర, శివ, అవినాష్, మహమ్మద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర కాల్పుల్లో అమాయకుల మృతి బాధాకరం

కర్నూలు(అర్బన్): పహల్గాంలోని బైసరన్ మైదాన ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పలువురు అమాయకులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వీ రామచంద్రారెడ్డి అన్నారు. మృతుల ఆత్మ శాంతి కోసం గురువారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్ ప్రాంతాన్ని వేసవిలో పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో సందర్శించేందుకు మొగ్గు చూపుతుంటారన్నారు. తమ ప్రాబల్యాన్ని చాటుకునేందుకు ఉగ్రవాదులు ఇలా ఘాతుకానికి ఒడిగట్టడాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ మద్దన్న, డీఈఈలు రవీంద్రారెడ్డి, కర్రెన్న, బండారు శ్రీనివాసులు, అమర్‌నాథ్, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న దృశ్యం పీఆర్ ఇంజినీర్లు

ఉగ్రదాడి పిరికిపంద చర్య

కర్నూలు: పహల్గామ్ ఈనెల 22న జరిగిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని సేవ్ వక్ఫ్ సేవ్ కాన్స్టిట్యూషన్ జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. కర్నూలులోని రిసాల్‌దార్ మసీదు (మౌర్యా ఇన్ ఎదురుగా)లో జరిగిన సేవ్ వక్ఫ్ సేవ్ కాన్స్టిట్యూషన్ జేఏసీ సమావేశంలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేశారు. అమాయకులైన పర్యాటకుల్లో భార్య ముందు భర్తను, రెండు నూతన జంటలను కనికరం చూపకుండా తుపాకులతో కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదాలను ఉరి తీయాలని ఆ సంఘం కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్ రషీద్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ అజీజ్ ఖాన్, ఎంఏ హమీద్ డిమాండ్ చేశారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు జేఏసీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మౌన దీక్ష

కర్నూలు (టౌన్): కశ్మీర్‌లో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మౌనదీక్ష చేపట్టారు. స్థానిక గౌరిగోపాల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ చింతా సురేష్ బాబు మాట్లాడుతూ దేశంలో అశాంతిని సృష్టించాలనే చూసే ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ కార్పోరేషన్ డైరెక్టర్ మంజునాథ్, పవన్‌కుమార్, సంధ్యా విక్రమ్ కుమార్, మహమ్మద్ షబ్బీర్, బజారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఖండించాలి

కర్నూలు(సెంట్రల్): కశ్మీర్‌లో ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ కోరారు. గురువారం కాంగ్రెస్‌పార్టీ కార్యాలంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడిలో 29 మంది సాధారణ పౌరులు చనిపోవడం బాధాకరమని, వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు ప్రకటించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జాన్, సదానందం పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

కర్నూలు(సెంట్రల్): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని ముస్లిం పర్సనల్ లా బోర్డు కన్వీనర్ జాకీర్ మౌలానా అభివర్ణించారు. గురువారం అవాజ్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మానవతా దృక్పథం కలిగిన ప్రతి ఒక్కరూ ఉగ్ర చర్యను ఖండించాలన్నారు. ఇది మతోన్మాద ఉగ్రవాదమేనని, ఈ చర్యలో పాలుపంచుకున్న వారిని కాల్చి చంపాలన్నారు. కశ్మీర్ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. సమావేశంలో ఆ సంఘం కో కన్వీనర్లు మాజీద్ మౌలానా, ఎస్‌ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన స్పోర్ట్ మీట్

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో రేంజ్–2 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2025 రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగింది. గురువారం ఉదయం 7 గంటలకు బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై పెరేడ్ గ్రౌండ్‌లో క్రీడాపోటీలను ప్రారంభించారు. జావలిన్ త్రోలో 11వ బెటాలియన్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనపరిచి ప్రథమ, తృతీయ బహుమతులు కైవసం చేసుకోగా, 9వ బెటాలియన్ క్రీడాకారులు ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. డిస్కస్ త్రోలో 11వ బెటాలియన్ ప్రథమ బహుమతి, 9వ బెటాలియన్ తృతీయ బహుమతి, ఎస్‌ఏఆర్‌సీపీఎల్ తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారు. అలాగే క్రికెట్ పోటీలో కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్, అనంతపురం బెటాలియన్ జట్ల మధ్య సెమీఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. కర్నూలు రెండో బెటాలియన్, ఎస్‌ఏఆర్‌సీపీఎల్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరగనుంది. అలాగే బాస్కెట్ బాల్‌లో కర్నూలు బెటాలియన్‌లో క్రీడాకారులు ప్రతిభ కనపరచి విన్నర్స్‌గా నిలిచారు. టగ్ ఆఫ్ వార్ కర్నూలు, అనంతపురం జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరగనున్నాయి. రాత్రి పొద్దుపోయే దాకా వివిధ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. శుక్రవారం ముగింపు వేడుకల నేపథ్యంలో బెటాలియన్స్ ఐజీ రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వివిధ క్రీడాంశాల్లో విజయం సాధించిన వారికి ఆమె చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నారు.

వృద్ధులకు అన్నదానం

కర్నూలు (టౌన్): జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్, కోల్స్ అకర్‌మెన్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పాస్టర్ ప్రవీణ్ పగడాల జ్ఞాపకార్థ కూడిక నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయుల భవనంలో వృద్ధులకు అన్నదానం చేపట్టారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ జీ. రవికుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని, ఆయనను ఆదర్శంగా తమ సంస్థ తరపున ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎస్.కే. జాషువా, ప్రసాద రావు, పుష్పరాజ్, మధు కిరణ్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. అడ్మిషన్లు చేయకూడదని ప్రకటనలు జారీ చేసినా కూడా ఆ ప్రకటనలను ఆ స్కూళ్ల యాజమాన్యాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దామోదర్, హుసేన్, సాయి పాల్గొన్నారు.

తనిఖీలతో దడ పుట్టిస్తున్న అధికారులు



కుళ్లిపోయిన పండ్లను చూపుతున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఏర్పాటైన అధికారుల బృందం వరుస దాడులతో దడ పుట్టించింది. గురువారం కర్నూలులోని వెంకటరమణ కాలనీలో ఉన్న రైతు బజార్‌లో రాఘవయ్య అనే పండ్ల వ్యాపారి స్టాల్‌ను తనిఖీ చేయగా పాడైనపండ్లు ఉన్నట్లు గుర్తించారు. అతని దగ్గర నుంచి పాడైన ఆరు కేజీల ద్రాక్ష, నాలుగు కేజీల బొప్పాయి, కేజీ సపోట పండ్లను సీజ్ చేశారు. అలాగే అదే షాపులో ప్లాస్టిక్ కవర్లు ఉండడంతో మునిసిపల్ హెల్త్ అధికారులు రూ.5వేల జరిమానా విధించారు. అదే కాలనీలోని పుష్పలత అనే వ్యాపారి దగ్గర తూకాల్లో తేడాలు ఉండడంతో వేయింగ్‌మిషన్‌ను లీగల్ మెట్రాలజీ అధికారులు సీజ్ చేశారు. పంచలింగాల రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారులు తనిఖీ చేసి కందుల కొనుగోలులో రైతులకు రావాల్సిన పైకం గురించి ఆరా తీశారు. వాణిజ్య పన్నుల శాఖాధికారులు వెల్దుర్తిలో సాయి శ్రీనివాస కమర్షియల్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి అక్కడున్న రికార్డుల నిర్వహణ సరిగా లేనందున సంబంధిత ఏజెంట్ నారాయణకు రూ.25 వేల జరిమానా విధించారు. ఆయా దాడుల్లో డీఎస్‌ఓ రాజారఘువీర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న క్యాంప్ కమాండెంట్ మేజర్ చైతన్య రెడ్డి

కర్నూలు (టౌన్): వన్ ఆంధ్ర మెడికల్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి క్యాంపు కమాండెంట్ మేజర్ చైతన్య రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సిస్టర్ స్టాన్సులా ఇంగ్లిషు మీడియం ప్రాంగణంలో ఎన్‌సీసీ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 10 రోజుల పాటు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ శిక్షణ, సోషల్ అవేర్నెస్ ఉంటాయన్నారు. ఈ శిక్షణలో 600 మంది క్యాడెట్లు, 9 మంది ఏఎన్‌ఓలు, సీఐ స్టాఫ్, సివిల్ క్యాంపులు ఉంటాయని తెలిపారు. క్యాంపు నిర్వాహకులు దాసరి సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్లు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అనిల్, ప్రతాప్, రవికుమార్, క్యాంప్ సూపరింటెండెంట్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన సాధన అవసరం



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియదర్శిని

కర్నూలు (టౌన్): క్రమశిక్షణతో కూడిన సాధన చేయడంతో స్కేటింగ్‌లో ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తారని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ప్రియదర్శిని అన్నారు. గురువారం స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఉన్న స్కేటింగ్ రింక్‌లో ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా ఆసక్తి ఉన్న క్రీడల్లో సాధన చేయాలన్నారు. స్కేటింగ్ వంటి గుర్తింపు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కేటింగ్ సాధన వైపు పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు సురేంద్ర, స్కేటింగ్ సీఈఓ సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అబుబాకర్, పునీతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలి



జేసీ నవ్యకు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని ఏఐఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబరులో జేసీ డాక్టర్ బి.నవ్యను కలిసి ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కొన్ని కఠినతరమైన నిబంధనలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు. ముఖ్యంగా డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో జిల్లా యూనిట్‌గా తీసుకొని నిర్వహించాలన్నారు. ఎక్కువ సిలబస్ ఉండడంతో పరీక్షకు 70–90 రోజుల వ్యవధి ప్రిపరేషన్ కోసం ఇవ్వాలన్నారు. జూన్ 16–26 మధ్య ఏపీపీఎస్సీ పరీక్షలు ఉండడంతో రెండు పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలలో కచ్చితంగా 45 శాతం వచ్చి ఉండాలనే నిబంధనను తొలగించాలని కోరారు. మరోవైపు జీఓ ఎంఎస్ 24 ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు చెల్లించాలని కోరారు.

హిమోఫీలియాపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): హిమోఫీలియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు అన్నారు. ప్రపంచ హిమోఫీలియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో కర్నూలు చాప్టర్ హిమోఫీలియా సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హిమోఫీలియాకు చేయగల చికిత్సలను వివరించారు. హిమోఫీలియా జబ్బు ఎలా వ్యాపిస్తుంది, కట్టడికి చర్యలపై డాక్టర్ మౌనిక, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రకాష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాకర్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి వివరించారు. కర్నూలు చాప్టర్ హిమోఫీలియా సొసైటీ ప్రెసిడెంట్ పార్థసారథి మాట్లాడుతూ ఫ్యాక్టర్ 7, 9, వాన్‌విల్లిబ్రాండ్ ఇంజెక్షన్లను తెప్పించాలని, ఐసీహెచ్‌హెచ్ ల్యాబోరేటరిలో రక్త సంబంధిత వ్యాధుల వారికి ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మేనేజర్‌కు అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక మేనేజర్ చిన్నరాముడుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం కమిషనర్ రవీంద్రబాబు ఆయనకు ప్రజా సంబంధాల అధికారిగా (పీఆర్‌ఓ) అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పీఆర్‌ఓగా పనిచేస్తున్న కేఎల్ఎన్ రెడ్డిని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం పొదిలి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలను మేనేజర్‌కు అప్పగించారు.

నేటి నుంచి ఉచితంగా నైపుణ్యశిక్షణ కోర్సులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో నైపుణ్య శిక్షణ కోర్సును ఉచితంగా అందించనున్నట్లు సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ సెంచురీ ఐఏఎస్ అకాడమి (హైదరాబాద్) వారిచే వేసవి సెలవులలో ఈ నెల 25 నుంచి మే 28వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు https:// teams.live.com.meet/9328525389774?p= KfeQQOs RaHX9ey VkC లింక్ ద్వారా జాయిన్ కావాలన్నారు. ఈ లింక్‌ను మండల విద్యాధికారుల ద్వారా టీచర్, విద్యార్థుల గ్రూపులతో షేర్ చేశామన్నారు. వివరాలకు 9292207601, 9642065559ను సంప్రదించాలని సూచించారు.

లారీ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కర్నూలు (రూరల్): కర్నూలు మండలం గొందిపర్లలోని టీజీ ఆల్కలీస్ ఫ్యాక్టరీ గేటు ముందు కంపెనీకి సంబంధించిన లారీ కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అర్బన్ తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఫ్యాక్టరీ రెండో గేటు వద్ద లారీ వెనుక వ్యక్తి నిలబడివుండగా డ్రైవర్ గమనించకుండా రివర్స్ చేయడంతో అతనిపై చక్రాలు ఎక్కి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా కాశీపురం గ్రామానికి చెందిన వ్యక్తి అయ్యి వుండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు ఆర్.నరసింహులు, సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీన సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారుమాట్లాడుతూ..సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు రుణాలు ఇవ్వాలని, పిల్లల చదువుకు సహకారం అందించాలని కోరారు.

పద్యంతో సామాజిక చైతన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: పద్యంతో సామాజిక చైతన్యాన్ని కలిగించవచ్చని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ప్రముఖ కవి డి.పార్వతయ్య రచించిన ×బొమ్మల గాథలు× పుస్తకాన్ని గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యంతో చైతన్యం కలిగించ వచ్చని బొమ్మల గాథలు పుస్తకంలో వివరించారన్నారు. బసవేశ్వరుడు, పోతులూరి వీరబ్రహ్మం, వేమన లాంటి వారు పద్యం ద్వారా సామాజిక చైతన్యాన్ని కాంక్షించారన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కళాక్షేత్రం తరుపున రూ. 5వేల చెక్‌ను అందజేశారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు ఎంపీ బసవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శంకర్ శర్మ, సాహితీ స్రవంతి నగర నాయకులు విజయులు, వెంకటేశ్వర్లు, బసయ్య, విరసం నాయకులు నాగేశ్వరాచారి, కవులు రచయితలు, కళాకారులు మారుతి, డాక్టర్ సుభాన్, షఫీవుల్లా, విశ్రాంత తహశీల్దార్ రోషన్ అలీ, అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు రాజశేఖర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్యాన్ని, భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, సైబర్‌క్రైమ్ అనే అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు ఆయన మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు వెళ్లకూడదని, యోగ, వ్యాయామం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాట వల్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏబీసీ విక్రయించిన బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తులు చెల్లవు

కర్నూలు(అర్బన్): తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పీఏబీసీ విక్రయించిన బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తులు చెల్లవని, ఈ మేరకు మద్రాసు హైకోర్టు తీర్పు ఇచ్చిందని కర్నూలు తెలుగు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ మణిరత్నం, ఎం ఎడ్వర్డ్‌రాజు అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాప్టిస్ట్ క్రైస్తవ ఆస్తులు పీఏబీసీవి కావని, అమెరికా, యూఎస్‌ఏ నుంచి 18వ శతాబ్దంలో మిషనరీలు స్థాపించిన ఏబీఎఫ్‌ఎంఎస్‌కు సంబంధించిన ఆస్తులని తెలిపారు. ఏబీఎఫ్‌ఎంఎస్ ఆస్తులు పీఏబీసీకి బదిలీ కాలేదని, ఐదు రీజినల్ ఫీల్డ్ ఎస్‌టీబీసీ, పీఏబీసీ క్రైస్తవ సేవా అనగా చర్చిలు, స్కూల్స్, హాస్పిటళ్ల నిర్వహించేందుకు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. సమావేశంలో ఏపీ బోర్డు మెంబర్ కే క్రిష్ణబాబు, ఇసీ మెంబర్లు రామక్రిష్ణ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధిపై చిన్నచూపు తగదు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం దళితవాడల అభివృద్ధిపై చిన్న చూపు చూస్తుందని, ఇందుకు కర్నూలు నగరంలోని 18వ వార్డు జోహరాపురమే నిదర్శనమని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ విమర్శించారు. గురువారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక తప్పెట గేరిలో చెత్త పేరుకుపోవడం, రోడ్లపైకి మురుగునీరు వస్తుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారి వెంట సుజాతమ్మ, శ్యామలమ్మ, మాలన్‌బీ, కృమాన్‌బీ, వేణమ్మ, విజయలక్ష్మి ఉన్నారు.